క్లుప్తంగా...

లాల్‌దర్వాజా ఆలయ కమిటీ చైర్మన్‌గా రాజేందర్‌యాదవ్



రాజేందర్ యాదవ్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్‌గా మాజీ కార్పొరేటర్ సి.రాజేందర్‌యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయంలో ఆదివారం ఫోర్‌మెన్ కమిటీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో కమిటీ సభ్యులు చైర్మన్‌గా రాజేందర్ యాదవ్, కన్వీనర్‌గా గౌని అరవింద్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బి.మారుతీయాదవ్, కోశాధికారిగా పోసాని సదానంద్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. పూర్తి స్థాయి కమిటీని త్వరలోనే ఎన్నుకుంటామన్నారు. నూతన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫోర్‌మెన్ కమిటీ చైర్మన్‌లు శివకుమార్‌యాదవ్, పోసాని సురేందర్ ముదిరాజ్, శీర రాజ్ కుమార్, బద్రీనాథ్‌గౌడ్, సలహాదారులు కాశీనాథ్‌గౌడ్, మాజీ చైర్మన్ మాణిక్ ప్రభుగౌడ్ పాల్గొన్నారు.

మొదలైన మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మధుసూదన్‌గౌడ్ తదితరులు

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ మహంకాళి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనుల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం రాజనర్సింహాచార్యులు, పవన్‌కుమార్ ఆచార్యుల పర్యవేక్షణలో గణపతి పూజ, పుణ్యావాచకం, వాస్తు హోమం, ఈశాన్య స్తంభ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జనగామ మధుసూదన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కీర్తి నరేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పతాకావిష్కరణకు ఏర్పాట్లు



గోల్కొండలో కేంద్ర పురాతత్వశాఖ అధికారులతో బీజేపీ నాయకులు

గోల్కొండ: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను గోల్కొండ కోటలో బీజేపీ ఆధ్వర్యంలో జరగనున్నాయని బీజేపీ నాయకులు టి.అమర్ సింగ్, దేవర శ్రీనివాస్ అన్నారు. కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి ఈనెల 2న గోల్కొండ కోటలో పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం వారు కేంద్రపురావస్తు శాఖ హైదరాబాద్ రీజియన్ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ స్మితా కుమార్‌తో గోల్కొండ కోటలో పతాకావిష్కరణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్మితా కుమార్ మాట్లాడుతూ.... పతాకావిష్కరణ వేడుకల పరిసరాల్లో భద్రత ఏర్పాట్లు చూసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ కోట సీనియర్ పరిరక్షణ అధికారి నవీన్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కార్యాలయ అధికారి సంపత్ తదితరులున్నారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం



గోల్కొండ: హజ్, ఉమ్రా తీర్థ యాత్రలకు వెళ్లి రావడం ప్రతిఒక్క ముస్లిం జీవిత ఆశయమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం గోల్కొండ అరబ్ గల్లీలో ఉమ్రా యాత్రకు వెళ్లి వచ్చిన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉమ్రా యాత్రకు వెళ్లి వచ్చిన వారికి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నానల్ నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, గోల్కొండ కార్పొరేటర్ ప్రతినిధి బదర్ ఉద్దీన్, అజీజ్‌ఖాన్ పఠాన్, జుబేర్ బిన్ అవధ్, మతీన్‌ఖాద్రీ తదితరులున్నారు.

పాతబస్తీ బోనాల్లో అలరించనున్న ప్రదర్శనలు

- సామూహిక ఘట స్థాపన ఊరేగింపుతో పాటు ప్రధాన ఊరేగింపులో..
- నెల రోజుల ముందు నుంచే ఆర్డర్లు తీసుకుంటున్న కళాకారులు
- ఇతర రాష్ట్రాల కళాకారులకు జీవనోపాధి కల్పిస్తున్న కళా ప్రదర్శనలు



బోనాల జాతర ఉత్సవాల్లో కళాకారుల కళా ప్రదర్శనలు (ఫైల్)

చార్మినార్: పాతబస్తీలో ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల్లో కళాకారుల నృత్య ప్రదర్శనలు హైలెట్‌గా నిలువనున్నాయి. మూడేళ్ల క్రితం కరోనా భయంతో సాదా సీదాగా బోనాల ఉత్సవాలు జరిగాయి. గతేడాది కొన్ని ఆంక్షల నడుమ ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు జరిగినా పూర్తి స్థాయిలో కళాకారుల ప్రదర్శనలు జరుగలేదు. ఈసారి ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో ఈ సారి కళాకారుల ప్రదర్శనలు హైలెట్‌గా నిలువనున్నాయి. నెల రోజుల ముందు నుంచే కళాకారులకు ఆహ్వానాలు అందుతాయి.

ఇతర రాష్ట్రాల నుంచి..

బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా నిర్వహించే అమ్మవారి ఘటాల ఊరేగింపులో కళాకారులు ప్రదర్శించే వివిధ రకాల నృత్యాలు విశేషంగా ఆకట్టుకుంటాయి. అమ్మవారి ఘటాల ఊరేగింపులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాకారులే కాకుండా కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలువురు కళాకారులు పాల్గొంటారు. బోనాల జాతరలో వీరికే అధిక ప్రాధాన్యం. ఉత్సవాల్లో కళాకారులు ప్రదర్శించే హావభావాలను చూసే ప్రతి భక్తుడు భక్తిపారవశంతో తన్మయత్వం పొందుతాడు. ఘట స్థాపన ఊరేగింపు, పోతురాజుల నృత్యాలు, అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు తదితర కార్యక్రమాల్లో వివిధ రూపాల్లోని కళాకారుల నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతగానో అలరిస్తాయి.లాల్‌దర్వాజ చౌరస్తా నుంచి నయాపూల్ వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా అమ్మవారి భక్తులు ఈ నృత్య ప్రదర్శనలు తిలకిస్తారు.చరిత్రాత్మకమైన చార్మినార్ కట్టడం వద్ద పెద్ద ఎత్తున భక్తుల కోలాహలం ఉంటుంది.

ఇతర రాష్ట్రాల కళాకారులకు ఉపాధిగా..

తెలంగాణ రాష్ట్రంలో జరిగే బోనాల జాతర ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కళాకారులు ఎక్కువగా పాల్గొంటారు. వీరు ప్రతి ఏడాది వినూత్న తరహా రూపొందించే వివిధ రకాల శకటాలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తాయి. నగరంలో బోనాల జాతర ఉత్సవాల్లో కళాకారులు, వినూత్న తరహా సెట్టింగ్స్ కోసం నిర్వాహకులు పెద్ద ఎత్తున ఖర్చు చేస్తారు.పాతబస్తీలోని ప్రముఖ దేవాలయాల నిర్వాహకులు కళాకారులను ఏర్పాటు చేయడానికి ఉత్సాహం చూపిస్తుండడంతో వారి రేట్లు కూడా పెరిగాయి. అంగరంగ వైభవంగా నిర్వహించే ఈ ఊరేగింపు ఉప్పుగూడ, బేలా, గౌలిపురా, శాలిబండ, కోట్ల అలీజా, మీరాలంమండి, కసరట్ట తదితర ప్రాంతాల నుంచి చార్మినార్ ద్వారా నయా పూల్‌లోని మూసీనది వరకు కొనసాగుతుంది.ఊరేగింపులో పాల్గొనే దేవాలయం తరపున ఆకట్టుకునే సెట్టింగ్స్, విచిత్ర వేషాధారణలతో పాల్గొనే కళాకారుల కోసం దారి పొడవునా వేచి ఉన్న భక్తులు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తారు.

మీరాలంమండికి ప్రత్యేకం..

మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయానికి చెందిన వివిధ రకాల శకటాలు, కళాకారుల నృత్యాల బృందం ప్రతిసారి జరిగే బోనాల జాతర ఘటాల ఊరేగింపులో తమ ప్రత్యేకతను చాటుకుంటారు. ఈ ఊరేగింపులో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు పాల్గొంటారు. ఇప్పటికే వీరందరికి అడ్వాన్స్‌లు చెల్లించినట్లు దేవాలయం కమిటీ అధ్యక్షులు గాజుల అంజయ్య తెలిపారు. దాదాపు 12 శకటాలతో వివిధ రూపాల్లోని కళాకారులతో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.



ఈసారి భారీ ఏర్పాట్లు..



ఈ సారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాం. నిజాం కాలం నుంచి ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్న పాతబస్తీలో జరిగే ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. పాతబస్తీలోని ప్రముఖ దేవాలయాలకు చెందిన వివిధ రకాల శకటాలు, కళాకారుల నృత్యాల బృందం ప్రతిసారి జరిగే బోనాల జాతర సామూహిక ఘటాల ఊరేగింపులో తమ ప్రత్యేకతను చాటుకుంటారు.

– గాజుల అంజయ్య, మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు

దేశ వ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు ఆదరణ



బీఆర్‌ఎస్‌లో చేరిన సిక్వాల్ ట్రస్టీలు, చిత్రంలో నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

అబిడ్స్: సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్ని వర్గాల వారు బీఆర్‌ఎస్ వైపు వస్తున్నారని టీడీసీ చైర్మన్ వేణుగోపాలచారి పేర్కొన్నారు. పలు పార్టీల వారు, పలు సమాజీల వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఆయన అన్నారు. సిక్వాల్ సమాజ్ ట్రస్టీలు సందీప్ జైల్వాల్, జుగల్ కిశోర్ ఉపాధ్యాయ, శ్రీనర్పత్‌లాల్ జోషి, అజయ్ కండోయిలు గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ నేతృత్వంలో చైర్మన్ వేణుగోపాల చారి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ వేణుగోపాల చారి మాట్లాడుతూ.. తెలంగాణ తరహాలోనే దేశ వ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు ఆదరణ లభిస్తుందన్నారు. ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర నలుమూలలా రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయఢంకా మోగిస్తుందన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం



డాక్టర్ ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేనిని సత్కరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, డీఎస్‌ఓ రమేష్ తదితరులు

అబిడ్స్: పౌర సరఫరాల శాఖ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. తెలంగాణ పౌర సరఫరాల శాఖ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా పౌర సరఫరాల అధికారి రమేష్ డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేనిని సత్కరించి పౌర సరఫరాల శాఖలో నెలకొని ఉన్న సమస్యలను ఆయనకు వివరించారు. శాఖలో సర్వీస్ రూల్స్ లేవని, జీఓ నంబర్:302 ప్రకారం ఉద్యోగుల విభజన సరిగా కాలేదని, ప్రమోషన్లు ఇవ్వడం లేదని వారు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. త్వరలోనే రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్, రాష్ట్ర పౌర సరఫరాల మంత్రిని కలిసి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నరేష్, ఖాలీద్ అహ్మద్, శ్రీధర్, సుధీర్, నసీర్, నందరాజ్, జగదీస్, నాయక్, పృథ్వీ, సమీర్, అయాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



రహింపురాలో పర్యటించిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ తదితరులు

అబిడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్ డివిజన్‌లోని రహింపురా ప్రబోద్ గర్ల్స్ హైస్కూల్ ప్రాంతంలో ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. హైస్కూల్‌లో సైతం పలు సమస్యలు ఉన్నాయని యాజమాన్యం ఆశీష్ కుమార్ యాదవ్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలన్నీ ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జీహెచ్‌ఎంసీ, విద్యుత్, వాటర్‌బోర్డుతో డీఈఓ శాఖ అధికారుల దృష్టికి ప్రబోద్ గర్ల్స్ హైస్కూల్ సమస్యలను తీసుకువెళ్లి వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యమిస్తానన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల వజ్రోత్సవాలకు సహకరిస్తాం

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వజ్రోత్సవాలకు సహకారం అందిస్తామని సాంకేతిక విద్యాశాఖ బోర్డు కార్యదర్శి ఆకుటి పుల్లయ్య తెలిపారు. మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వజ్రోత్సవాలకు ఉన్నతాధికారులు సహకరించాలని ఇటీవల బాధ్యతలు చేపట్టిన పుల్లయ్యను మాసబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సురేష్‌ఆనంద్ కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సురేష్ ఆనంద్ మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధి, వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తాము చేస్తున్న కృషిని తెలిపారు.

అన్ని డివిజన్లకు సమ ప్రాధాన్యం

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్



న్యూ సత్యనారాయణనగర్‌లో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ సెక్యులర్ పార్టీ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడంలో ఎటువంటి వివక్ష ఉండదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన న్యూ సత్యనారాయణ నగర్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ టీవీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో అన్ని డివిజన్లకు సమ ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేయిస్తున్నానన్నారు. న్యూ సత్యనారాయణ నగర్ వాసులు ఐక్యంగా ఉండి కాలనీలను అభివృద్ధి చేసుకోవడం అభినందించదగ్గ విషయమని ఆయన అన్నారు. కాలనీలో నేరాల నియంత్రణకు శాంతి భద్రతలను కాపాడటానికి సీసీ టీవీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. మరోవైపు నియోజకవర్గంలో కార్వాన్ నియోజకవర్గానికి అధునాతన డ్రైనేజీ ఏర్పాటుకు సుమారు రూ.300 కోట్లు మంజూరు అయ్యాయని, న్యూ సత్యనారాయణనగర్‌లో కూడా కొత్త డ్రైనేజీ వేయించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, బీజేపీ నాయకులు దేవర వంశీ, పవన్ సింగ్ లోధ్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులున్నారు.

భారీగా ఎస్సైల బదిలీలు

గోల్కొండ: సౌత్ వెస్ట్ జోన్‌లో భారీగా ఎస్సైల బదిలీలు అయ్యాయి. గోల్కొండ, ఆసిఫ్‌నగర్, హుమాయున్‌నగర్ స్థానాలకు చెందిన ఎస్సైలు బదిలీ అయ్యారు. కొత్తగా ఏర్పాటు కానున్న గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్‌కు పి. గాలి నాయుడు, బి.గోపి, మహబూబ్‌పాషా, సయ్యద్ సాదొద్దీన్ నియమితులయ్యారు. గోల్కొండలో ఎస్సైలుగా విధులు నిర్వహిస్తున్న గణేష్ గౌడ్ వినోద్‌కుమార్ కొత్తగా ఏర్పాటయ్యే ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అదేవిధంగా కొత్తగా ఏర్పాటవుతున్న మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్‌కు హుమాయున్ నగర్‌లో ఎస్సైలు విధులు నిర్వహిస్తున్న రాజు, టాస్క్‌ఫోర్స్ నుంచి చంద్రమౌళి, చంద్రాయన్‌గుట్టకు చెందిన గడ్డం శేఖర్, బంజారాహిల్స్ పీఎస్‌కు శోభ శ్రీకాంత్‌గౌడ్‌గా ఎస్సైలుగా నియమితులయ్యారు. ఆసిఫ్‌నగర్ పీఎస్‌లో ఎస్సైగా పనిచేస్తున్న నీలబోయిన శ్రీశైలం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌కు, పంజగుట్ట ఎస్సై ఎండీ రఫీయుద్దీన్ గోల్కొండకు బదిలీ అయ్యారు. అదే విధంగా పంజగుట్ట ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ హుమాయున్ నగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సాయికాంత్ మాదన్న పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. గోల్కొండలో ఎస్సైగా పని చేస్తున్న గాజు శ్రీనివాసులు చంద్రయణగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అదే విధంగా కొత్తగా ఏర్పాటవుతున్న లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు రామాంజనేయులు, నాగరాజు, సాయిశ్రీనివాస్ యాదవ్, ప్రేమ్‌రాజ్ నియమితులయ్యారు.



అనుమానాస్పదంగా మజ్లిస్ నాయకుడి మృతి



గోల్కొండ: అహ్మద్‌నగర్ కాలనీ మజ్లిస్ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఖాలెద్ (37) మృతి చెందారు. ఈయన మృతిపై పలువురు వివిధ రకాలుగా చూస్తున్నారు. బాగ్దాద్ కాలనీ నాలాను ఆనుకుని ఉన్న ఇంటి ముందు గుండె పోటుతో ఆయన మృతి చెందారని పలువురు అంటున్నారు. అయితే ఇంటి ముందు ఉన్న నాలాకు ఉన్న ఇనుప ఫెన్సింగ్‌కు అనుకోకుండా చేయి తగిలినందు వల్లే ఆయన విద్యుదాఘాతంతో మృతిచెందారని మరికొందరు అంటున్నారు. నాలాకు ఉన్న ఎత్తైన ఇనుప ఫెన్సింగ్ విద్యుత్ తీగలు తగిలి నాలా ఫెన్సింగ్‌లో సైతం విద్యుత్ ప్రవహించిందని, అనుకోకుండా మృతుడు ఖాలెద్ ఫెన్సింగ్‌ను పట్టుకోవడం వల్లే విద్యుదాఘాతానికి మృతి చెందారని మరికొందరు అంటున్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మృతదేహాన్ని సందర్శించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

గోల్కొండ: కోవెల రంగనాయకస్వామి ఆలయ ప్రాంగణంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రముఖ సంఘసేవకుడు, షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జంటనగరాల అధ్యక్షుడు ఎస్. రాజు వస్తాద్ అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్ తిరుపల్లిగడ్డలోని కోవెల రంగనాయకస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో శ్రీలక్ష్మీ నృసింహస్వామి సమేత గోదారంగనాథ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఈనెల 29వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయన్నారు. చండీ ఉపాసకులు బ్రహ్మశ్రీ పాలెం మనోహరశర్మ ఆధ్వర్యంలో ఈనెల 29, 30, 31వ తేదీలలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈ.శ్రీనివాసరాజు సలహాలు, సూచనల మేరకు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో దళిత నాయకుడు జగన్నాథం, ఆలయ పూజారి తదితరులున్నారు.

ఆకట్టుకున్న 'నిజమే నే చెబుతున్న' సంగీత ఆల్బమ్



ఆల్బమ్‌ను ప్రారంభిస్తున్న దర్శకుడు ఆనంద్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: యువ దర్శకులు రావాల్సిన అవసరం పరిశ్రమకు ఎంతగానో ఉందని ప్రముఖ దర్శకుడు వి.ఆనంద్ అన్నారు. ప్రముఖ లఘుచిత్ర దర్శకుడు డి.కృష్ణమూర్తి దర్శకత్వం వహించిన ×నిజమే నే చెబుతున్న సంగీత ఆల్బమ్‌ను హీరో హీరోయిన్‌లు సందీప్‌కిషన్, వర్షలతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఇద్దరు ప్రేమికుల మధ్య ఉండే మానసిక స్థితిగతులను ఆల్బమ్‌లో చూపినట్లు తెలిపారు. త్వరలో ఒక పెద్ద బ్యానర్ సంస్థలో దర్శకత్వం వహించబోతున్నానని, ఆ సినిమా వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హీరో హీరోయిన్‌లు బన్ని, హారిక, కో డైరెక్టర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీర్ సావర్కర్ జయంత్యుత్సవాలు



వీర్ సావర్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పిస్తున్న ఎస్‌ఆర్.లక్ష్మణ్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: వీర్ సావర్కర్ జయంతిని పురస్కరించుకుని బజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఆర్. లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడ చౌరస్తాలో వీర్ సావర్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. హిందూ ఐక్యత కోసం వీర్ సావర్కర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన సమాజానికి చేసిన సేవా ఎంతో ఉందన్నారు. ఆయన బాటలో నేటి యువత నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌సేనా ప్రతినిధులు ప్రవీణ్ దూబే, నందకిశోర్ అగర్వాల్, శ్రీనివాస్‌గుప్తా, మనోజ్, వికాస్ సింగ్, ప్రవీణ్‌యాదవ్, ఎస్‌కె.శర్మ, సురేందర్ సింగ్ ఉన్నారు.

తెలంగాణలో అవినీతి పాలన



మాట్లాడుతున్న బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి అమర్ సింగ్

గోల్కొండ: తెలంగాణలో అవినీతి పాలన సాగుతుందని బీజేపి కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి. అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ గోల్కొండ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడిస్తారన్నారు. స్వయంగా బీఆర్‌ఎస్ పార్టీ మంత్రులే అవినీతిలో కూరుకుపోయారని ఆయన అన్నారు. అవినీతి రహితంగా పాలించడం ఒక బీజేపీకే సాధ్యమని ఆయన అన్నారు. తెలంగాణలో బీజేపీకి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని, బీజేపీ నిర్వహించిన ప్రజాసంగ్రామ యాత్రలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌టీ రామారావు సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న నందకిశోర్, కేడీ దినేష్

అబిడ్స్: మాజీ ముఖ్యమంత్రి, సినీనటుడు దివంగత ఎన్టీఆర్ శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అబిడ్స్ రామకృష్ణ థియేటర్ వద్ద ఆదివారం సీనియర్ టీడీపీ నేతలు ప్యాట నందకిశోర్, కేడీ.దినేష్, మాజీ కార్పొరేటర్ రామ్‌నారాయణ యాదవ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనిల్, ఊర్మిళదేవి, మహేష్, సంతోష్ సింగ్, రాజు ముదిరాజ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న లక్ష్మణ్‌యాదవ్, నర్సింగ్‌రావు

జియాగూడ: రైతులు, యువకులు మహిళల కోసం దివంగత ఎన్టీఆర్ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ఆదర్శంగా నిలిచారని కార్వాన్ నియోజకవర్గం సీనియర్ టీడీపీ నాయకుడు లక్ష్మణ్‌యాదవ్, జియాగూడ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని జియాగూడ కంచికామాక్షినగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తాం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించేందుకు గడ్డం గంగాధర్ ఫౌండేషన్ అండగా ఉందని ఆ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఫీల్‌ఖానాలో ఉచిత విద్య దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు అయిన సమావేశంలో గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులందరికీ ఉచిత విద్య తమ ఫౌండేషన్ తరపున అందించి వారికి అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్‌ఖానా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు ఆయాజ్ ఉల్‌హక్, ఇతర నాయకులు ఇలియాజ్ ఉల్‌హక్, మహ్మద్ అబ్దుల్లాజీ, మహ్మద్ సులేమాన్, జావేద్ అన్సారి, అష్రఫ్‌ఖాన్, మహ్మద్ ఇజాజ్, అబ్దుల్ ఫయామ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జన్ దేవ్ జీ మహరాజ్‌కి నివాళి

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడలోని సిక్ చావనీ గురుద్వారలో ఆదివారం శ్రీ గురు అర్జన్ దేవ్ జీ మహరాజ్ 417వ సంస్మరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సిక్ సోదరులు ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ లలితాబాగ్ డివిజన్ అధ్యక్షుడు జమ్మిచెట్టు రాజు, హర్దీప్ సింగ్, ఖతర్ సింగ్, చోటూ సింగ్, మన్మోహన్ సింగ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేత జమ్మిచెట్టు రాజు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684